
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
గురువారం
01 ఆగస్టు
2024
పేజీలు 8
గుంటూరు పల్నాడు



# పింఛన్ పాట్లు

## వలంటీర్లతో ఇంక పని లేనట్లే..!

- ఈ నెల సచివాలయ సిబ్బందితోనే..
- ఉదయం 6 గంటల నుంచే పంపిణీ
- ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు
- వలంటీర్ల వ్యవస్థ ఇంక లేనట్లే?

గుంటూరు జిల్లా, నేటి దినపత్రిక సూర్య బ్యూరో :


**పింఛన్ పంపిణీకి కూటమి ప్రభుత్వం ఈ నెలలో కూడా సచివాలయ ఉద్యోగులనే ఉపయోగిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో వాలంటీర్ల ద్వారా చేపట్టిన ఈ పనిని.. ఇప్పుడు సచివాలయ ఉద్యోగులు నెత్తిన వేసుకున్నారు. ఇంకా చెప్పాలంటే కూటమి ప్రభుత్వం అలా వారిని ఇరికించింది.**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల పంపిణీ కోసం వైఎస్ జగన్ వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. తొలినాళ్లలో వాలంటీర్లపై తీవ్ర విమర్శలు చేసిన చంద్రబాబు నాయుడు.. ఎన్నికల ప్రచారం నాటికి స్వరం మార్చారు. తాను అధికారంలోకి వస్తే ఈ వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తానని, గౌరవ వేతనం రూ.5 వేలకు బదులుగా రూ. 10 వేల పెంచుతానంటూ హామీ ఇచ్చారు. మరోవైపు ఎన్నికల సమయంలో వైసీపీ ఈసీకి ఫిర్యాదు చేయడం ద్వారా చంద్రబాబు.. వాలంటీర్లను పెన్షన్ పంపిణీకి దూరం చేశారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. వాలంటీర్లు లేకుండానే గత నెల పింఛన్లను పంపిణీ చేసింది. ఇంక వాలంటీర్లు అవసరం ఏముంది..? అనే ఆలోచనలో సీఎం చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ వ్యవస్థనే రద్దుచేయాలని కూటమి నేతలు కూడా చంద్రబాబును కోరుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఎన్నికల ముందు రెండు నెలలు.. ఎన్నికల తర్వాత రెండు నెలలు.. వాలంటీర్లు ఖాళీగా ఉన్నారు. చంద్రబాబు పెంచి ఇస్తామన్న గౌరవవేతనం మాట దేవుడెరుగు.. వాళ్లకు రెగ్యులర్‌గా వచ్చే గౌరవ వేతనాలు కూడా అందలేదు. ఇక ఆగస్టులో వారికి వేతనాలు ఇస్తారో..? లేదో..? తెలియని పరిస్థితి నెలకొంది. ఎన్నికలు జరిగి రెండు నెలలు పూర్తయినా ఎలాంటి విధులు అప్పగించకపోవడం, వేతనాలు లేకపోవడంతో వాలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. తమను కొనసాగిస్తారో.. తొలగిస్తారో అనే అనుమానాల మధ్యే వాలంటీర్లు కలెక్టరేట్లు చుట్టూ తిరుగుతూ వినతి పత్రాలు అందిస్తున్నారు.




## సచివాలయ ఉద్యోగులకూ తప్పని ఇబ్బందులు

పింఛన్ల పంపిణీ విధులు అప్పగించడంతో సచివాలయ ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నేడు వందశాతం పింఛన్ల పంపిణీ పూర్తి అయిపోవాలన్న అధికారుల ఆదేశాలు ఏవిధంగా నెరవేరుతాయో చూడవలసిన పరిస్థితి నెలకొంది.



# బడి ఈడు పిల్లల్ని గుర్తించి పాఠశాలలో చేర్పించాలి





- జిల్లా కలెక్టర్ ఆదేశం
- టీములుగా ఏర్పడి ఇంటింటికి తిరగాలి
- ప్రతి పాఠశాలలో ఎన్రోల్మెంట్ పెంచాలి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** బివిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నమోదు తక్కువగా వున్నందున సచివాలయ , సమగ్ర శిక్ష సిబ్బంది , మండల ప్రత్యేక అధికారి , యంపీడీఓ లతో టీములుగా ఏర్పడి ఇంటింటికి వెళ్ళి బడి బయట పిల్లలను గుర్తించి ఎన్రోల్మెంట్ పెంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రత్తిపాడు లోని బివిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత

మిగతా 3లో..

# జగన్ రెడ్డి ఆర్భాటం కోసం ప్రజా సొమ్మును నాశనం చేస్తారా ?

**గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే. గళ్ళా మాధవి**

**చెత్త తరలించే ఎలక్ట్రిక్ ఆటో వాహనాలను పాడుబెట్టటం పై తీవ్ర ఆగ్రహం**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నడిచే తడి,పొడి చెత్తలను తరలించే ఎలక్ట్రిక్ ఆటో వాహనాలను నగరపాలక సంస్థ వెహికల్ షెడ్డును బుధవారం 21వ డివిజన్ పర్యటనకు వచ్చిన

మిగతా 3లో..

## ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి




గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : గుంటూరులో నారాయణ పాఠశాల ఆధ్వర్యంలో గుంటూరు అమరావతి రోడ్డు నుండి లాడ్జి సెంటర్ వరకు వన మహోత్సవ ర్యాలికిపి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవి బుధవారం ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భముగా గళ్ళా మాధవి మాట్లాడుతూ.... ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, ఇది అందరి జీవితంలో అలవాటు కావాలన్నారు. కాలుష్యం తగ్గాలంటే, వ్యాధులు దరి చేరవద్దంటే అందరూ చెట్లు పెంచడంపై దృష్టి సారించాలన్నారు. తాను విద్యార్థి దశలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు జన్మభూమి వంటి కార్యక్రమంలో భాగంగా పరిసరాలు శుభ్రంగా ఉంచి, మొక్కలు నాటానని,ఇదే స్ఫూర్తితో నేడు నారాయణ కాలేజ్ యాజమాన్యం అవగాహన ర్యాలీ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు.

## ఫిరంగిపురం తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన నాంచారయ్య



ఫిరంగిపురం మేజర్ న్యూస్: ఫిరంగిపురం మండల తహసీల్దార్ గా జి. నాంచారయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతం లో ఆయన కొల్లిపర మండలంలో తహసీల్దారుగా పనిచేస్తూ సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా తిరుపతి జిల్లా ఓజిలి కి బదిలీ అయ్యారు. కొద్ది రోజుల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో ఫిరంగిపురం తహసీల్దార్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఆయన వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ తాసిల్దార్ రాజా రమేష్, కార్యాల సిబ్బంది నాంచారయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తా అన్నారు.

## ప్రతి 9 మంది భారతీయుల్లో ఒకరికి క్యాన్సర్ ముప్పు.. డాక్టర్ గీతా రుక్మిణి



గుంటూరు వైద్యం మేజర్ న్యూస్ : గుంటూరు సంగడిగుంటలో ఆర్ఎంపీ & ఎపీ కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒమేగా హాస్పిటల్ సౌజన్యంతో సుమారుగా 200 మందికి పైగా పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఒమేగా హాస్పిటల్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ గీతా రుక్మిణి మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారిపై పోరాడాలంటే ప్రజల్లో చైతన్యం కలిగించడం ఎంతో ముఖ్యమన్న విషయాన్ని గుర్తించాలని, క్యాన్సర్ ను గుర్తించే స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించడం, క్యాన్సర్ పరిశోధనలకు నిధులు సమకూర్చడం ఎంతో అవసరమని పేర్కొన్నారు కార్యక్రమంలో అసోసియేషన్ తరఫున జి కృష్ణమూర్తి , బాబు ,జి శివరామకృష్ణ ,టీ నర్సింహారావు , ఏం శేష సాయి ,ఆర్ ప్రసూనాదేవి , రోజ్ లీనా ,సునీత లక్ష్మీ, బి శ్రీనివాసరావు ,హనుమంతరావు, పేరవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు

## ఆర్టీసీ డిపో అభివృద్ధికి డీఎం కృషి అభినందనీయం..



మంగళగిరి టౌన్ మేజర్ న్యూస్ మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్ లో ఆర్టీసీ డిపో మేనేజర్ గా బుధవారం ఉద్యోగ విరమణ చేసిన మంత్రు నాయక్ ను సూపర్వైజర్ అసోసియేషన్, వివిధ యూనియన్ నాయకులు శాలువాలతో సత్కరించి పుష్పగుచ్చాలను అందజేసి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సూపర్నెంట్ ట్రాఫిక్ డీజీ నాయక్ మాట్లాడుతూ డిపో మేనేజర్ గా మంత్రు నాయక్ బాధ్యతలు చేపట్టిన సుమారు రెండున్నర సంవత్సరాలలో డిపోను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. శ్రీశైలం రూట్ లో అత్యధిక ఈపీకే, ఓఆర్ పెంచి మంగళగిరి డిపోను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలోకి తీసుకెళ్లారన్నారు. డీఎం మంత్రు నాయక్ మాట్లాడుతూ తమ విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన డిపోలోని ఉద్యోగస్తులు, యూనియన్ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.గ్యారేజ్ ఏఎంఎఫ్ ఎన్ శ్రీనివాసరావు, ఆఫీస్ సూపర్నెంట్ శర్మ సీసీఎస్ డెలికేట్ బీ సాంబశివరావు పాల్గొన్నారు.

# అధికారులూ మీ తీరు మారదా ?: ఎమ్మెల్యే గళ్ళా మాధవి

### రెండోరోజు బుధవారం గుంటూరులో 21వ డివిజన్ వికలాంగుల కాలనీలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు,మేజర్ న్యూస్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గములో డ్రైనేజి సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని అధికారులతో పదేపదే సమీక్షలు నిర్వహించి, క్షేత్రస్థాయిలో పర్యటించిన కూడా అధికారుల్లో చలనం రాకపోవటం దురదృష్టకరం అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మండిపడ్డారు. బుధవారం 21వ డివిజన్ లో రెండో రోజు వికలాంగుల కాలనీలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పర్యటించారు. ఈ సందర్భముగా ప్రజలు ఎమ్మెల్యే తో తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ ప్రాంతం మొత్తం గంజాయికి అడ్డాగా మారిపోయిందని, ఖాళీ స్థలాల్లో గంజాయి సేవించి, ప్రజల మీద దాడులకు పాల్పడుతున్నారని, వీళ్ళ చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పించాలని కోరారు. అదే విధంగా ఈ డివిజన్ మొత్తం పారిశుధ్య లోపం స్పష్టం కనిపిస్తున్నదని,అయినా కూడా అధికారులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం దేనికి సంకేతమో చెప్పాలని అధికారులను నిలదీశారు. వికలాంగుల కాలనీలోని ప్రభుత్వ పాఠశాల నిర్వహణ అధ్వాన్నంగా ఉన్నదని, పిల్లలు చదువుకునే పాఠశాల ఆవరణలో చెత్తచెదారం, పిచ్చి మొక్కలతో నిండి, మురుగునీరు నిలిచి భయానకరంగా ఉన్న ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించి, ఇంత అధ్వాన స్థితికి గల కారణాలు అధికారులను అడుగగా ఈ ప్రాంతాల్లో పారిశుధ్య యంత్రాలు ఈ ప్రాంతంలోకి రావటం కష్టమని తెలుపగా



"ఇలా ప్రతి సమస్యకు దాటవేత ధోరణిలో సమాధానాలు ఇస్తే సమస్యకు పరిష్కారం ఎక్కడ దొరుకుతుందో సమాధానం చెప్పాలని, అసలు ఇంత నిర్లక్ష్యం వ్యవహరిస్తే పిల్లలు ప్రభుత్వ పాఠశాలకు ఎలా వస్తారని, అసలు ఈ వాతావరణంలో ఉన్న పాఠశాలకు మీ పిల్లలను పంపిస్తారా ? అని అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేసి, కారణాలు చెప్పకుండా ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ ప్రాంతంలో వీధిదీపాలు వెలగటం లేదని, గతంలో ప్రజాప్రతినిధులు ఇటువైపు తొంగిచూసేవారు కారని, ఇప్పుడు నేరుగా ఎమ్మెల్యేనే 2రోజుల పాటు పర్యటించటం పట్ల డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేసారు.

## పారిశుద్ధ్య కార్మికుల జీతాల సమస్యలను పరిష్కరించండి

గుంటూరు సిటీ (మేజర్ న్యూస్): నగరంలో పారిశుద్ధ కార్మికుల కు ఆగిన జీతాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మునిసిపల్ ఇంజనీరింగ్– టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ గుంటూరు నగరపాలక సంస్థ కమిటీ సభ్యులు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవనీయులు నజీర్ అహ్మద్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన కమిషనర్ కీర్తి చేకూరి ఐఎఎస్ గారి స్థానంలో దినేష్ కుమార్ ని ప్రభుత్వం గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ గా నియమించడం జరిగిందని ఆయన రాక ఆలస్యం కావడంతో ఈనెల నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న మూడు వేల మంది ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదని ఎవరైతే కమిషనర్ గా ఉంటారో వారు సి ఎఫ్ ఎం ఎస్ . వెబ్ సైట్ లో వేలిముద్ర వేస్తేనే ప్రభుత్వం జీతాలు మంజూరు చేస్తుందని మన నగరానికి ఇంకా కమిషనర్ గారు రాకపోవడం వలన ఈ ప్రక్రియ ఆలస్యమైందని ఈ కారణంగా కార్మికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందని తెలియజేశారు. ఈ సమస్యను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించాలని మధుబాబు శాసనసభ్యుని కోరడం జరిగింది. అందుకు



శాసనసభ్యులు ఈ విషయాన్ని నగరపాలక సంస్థ సూపరిండెంటింగ్ ఇంజనీర్కు తెలియపరిచారని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కమిటీ సభ్యులు ఏసుబాబు, భారతి, నాగేశ్వరరావు, నరేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## దోమలు బాబోయ్ దోమలు..!

### మంగళగిరి మండల పరిషత్ లో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ వాకర్స్ కి దోమల బెడద



మంగళగిరి టౌన్ మేజర్ న్యూస్: మంగళగిరి మండల పరిషత్ కార్యాలయం గ్రౌండ్లో పట్టణ ప్రజలు ఆరోగ్యం కోసం ఏర్పాటుచేసిన వాకింగ్ ట్రాక్ వద్దకు ఆరోగ్య రక్షణకు వాకర్స్ తెల్లవారుజామునే వాకింగ్ చేస్తూ, అలాగే ఫిట్నెస్ కోసం ఆ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన జిమ్ చేస్తూ ఆహ్లాదకరమైన ఆనందాన్ని అనుభవిస్తున్న తరుణంలో ఆ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండి, దోమల బెడదతో వాకర్స్ ఇబ్బంది ఇబ్బంది పడుతున్నారని వారు వాపోతున్నారు. అసలే వర్షాకాలం దోమల కాటు వలన డయేరియా వచ్చే ప్రమాదం ఉన్నందున సంబంధిత అధికారులు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచవలసినదిగా వాకర్స్ కోరుచున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అనేక ప్రభుత్వ కార్యాలయాలు ఎం డి ఓ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, అలాగే ప్రస్తుతం తాత్కాలికంగా తహసీల్దార్ కార్యాలయం కూడా ఉన్నందున ప్రభుత్వ అవసరాల రీత్యా అనేకమంది రాకపోకలు కొనసాగిస్తూ ఉంటారు. కావున సంబంధిత అధికారులు ఆ పరిసర ప్రాంతాల యొక్క శానిటేషన్ను పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని కోరుతున్నారు.

## హాస్య నట చక్రవర్తి ఆకుల వెంకయ్యకు ఘన నివాళులు.



తెనాలి మేజర్ న్యూస్: సుప్రసిద్ధ రంగస్థల కళాకారులు ,హాస్య నట చక్రవర్తి, దివంగత ఆకుల వెంకయ్య 39వ వర్ధంతి కార్యక్రమాన్ని ,ఆకుల వెంకయ్య స్మారక కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నందుల పేటలో గల వెంకయ్య విగ్రహం వద్ద బుధవారం నిర్వహించారు. సామాజికవేత్త తన్నీరు శివశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గరికపాటి సుబ్బారావు మాట్లాడుతూ చింతామణి నాటకంలోని శ్రీహరి పాత్రలో ఆకుల వెంకయ్య తనదైన నటనతో, హాస్యపు జల్లులు కురిపించారన్నారు. ఆ రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా పదివేలకు పైగా ప్రదర్శనలిచ్చి కళాభిమానుల నుండి ఎన్నో సన్మానాలు బిరుదులు పొందారని, నాటి ప్రభుత్వం ఆయనకు తెలుగు నాటక అకాడమీ అవార్డును ప్రదానం చేసిందన్నారు. కొన్ని తెలుగు చలనచిత్రాల్లో కూడా నటించిన, ఆకుల వెంకయ్య ప్రేక్షకుల అభిమానుల మనసులో సుస్థిర స్థానాన్ని పొందారన్నారు. తొలుత ఆకుల వెంకయ్య స్మారక కమిటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు బొల్లిమంత కృష్ణ మాట్లాడుతూ వెంకయ్య కళాకారుడు గానే కాకుండా మంచి హార్మోనియం, విధ్వంసుడని, ఎంతోమందికి శిక్షణ ఇచ్చి గొప్ప హార్మోనిస్టులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయన సొంతమని అన్నారు. ఆకుల వెంకయ్య కుమార్తె వీణ వరలక్ష్మి ,మన మడు వీణ నాగేశ్వరరావు ,తెలుగు పండితులు లక్కరాజు లక్ష్మణరావు ,పాతూరి సుబ్రహ్మణ్యం ,విష్ణు మలకల భీమేశ్వర ప్రసాద్ ,కళాకారులు దేవిశెట్టి కృష్ణారావు, పండిటి సుబ్బారావు ,కొప్పరాజు విజయ్, నాగం రమేష్, ముత్యాల లక్ష్మీ తులసి వినుకొండ శ్రీరామ్ మూర్తి ,చెరుకుమల్లి సింగారావు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## రమణారెడ్డి సేవలు అమూల్యం



గుంటూరు రూరల్, మేజర్ న్యూస్: సీనియర్ అసిస్టెంట్ గా వెంకట రమణారెడ్డి అందించిన సేవలు అమూల్యం అని పలువురు కొనియాడారు. గుంటూరు నగరం జె కె సీ కళాశాల ప్రాంగణంలోని బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. వెంకటరమణారెడ్డి పదవి విరమణ సత్కార కార్యక్రమం బుధవారం వీ- కన్వెన్షన్ లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఓపెన్ యూనివర్సిటీ కో- ఆర్డినేటర్ లు గోపిచంద్, నాగ సుశీల, సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొని రమణారెడ్డిని ఘనంగా సత్కరించారు.

## వైకుంఠపురం దేవస్థానం హుండీ లెక్కింపు.

తెనాలి టౌన్ న్యూస్: తెనాలి పట్టణం నందు ,వైకుంఠపురంలో వేంచేసి ఉన్న, శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు, ది.31-7-2024 బుధవారం నాడు భక్తులు శ్రీ స్వామివారికి సమర్పించిన కానుకలు మరియు మొక్కుబడులు హుండీ లెక్కింపు జరుపగా, రు.23,33,085-00 , లుగా వచ్చినది. ఈ హుండీ నగదు లెక్కింపును శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానంబి తెనాలి, గ్రేడ్ 1 కార్యనిర్వహణాధికారి G.Vఅమర్నాథ్ సమక్షంలో A.P.C.O.B బ్యాంకు, చెంచుపేట, తెనాలి. సిబ్బంది మరియు భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ వారితో పాటుగా దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారని, శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎం తిమ్మా నాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# రోగులకు సక్రమంగావైద్య సేవలు అందించండి





## ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ను పరిశీలించిన కలెక్టర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** డాక్టర్లు , వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు సరైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ ఆదేశించారు. బుధవారం ఉదయం ప్రత్తిపాడు కమ్యూనిటి హెల్త్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ ఆకస్మిక తనిఖీ చేశారు. మొదట ఆసుపత్రిలోని జనరల్ వార్డు , ఆపరేషన్ థియేటర్ , నేత్ర వైద్య విభాగం , ప్రసూతి విభాగాలను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఆసుపత్రికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. మందుల స్టాక్ రిజిస్టర్ తో పాటు , నిల్వ వుంచిన మందులను పరిశీలించారు. మందుల వివరాలన్ని కూడా ఈ ఔషధిలో తప్పక నమోదు చేయాలని తెలిపారు. ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతున్న రోగులతో ఇక్కడ అందుతున్న వైద్య సేవలు ఎలా వున్నాయని అడిగి తెలుసుకున్నారు. రోగుల సంఖ్య తక్కువగా నమోదు అవుతున్నదని , డాక్టర్లు మంచి వైద్యం అందిస్తారనే భరోసా కల్పించినపుడు మాత్రమే రోగులు ఆరోగ్య కేంద్రం ద్వారా చికిత్సకు ఉపక్రమిస్తారని తెలిపారు. కమ్యూనిటి హెల్త్ సెంటర్ పరిధిలోని గర్భిణీలను గుర్తించి వారికి వంద శాతం ప్రతి నెల పరీక్షలు నిర్వహించి సుఖవంతమైన ప్రసవానికి డాక్టర్లు ప్రత్యేక శ్రద్ద చూపాలని సూచించారు. గర్భిణీలను పరీక్షించే అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ చాలా కాలంగా మరమ్మత్తుల వల్ల అందుబాటులో లేకపోవడంతో గైనకాలజిస్ట్ డాక్టర్ అందుబాటులో వుండి కూడా వైద్య సేవలు సరిగా అందించలేకపోవడం జరుగుతున్నదనే విషయాన్ని తెలుసున్న జిల్లా కలెక్టర్ చరవాణి ద్వారా డియం అండ్ హెచ్ ఓ తో సంభాషించారు. సమీపంలోని గొట్టిపాడు ప్రైమరీ హెల్త్ సెంటర్ లో నిరుపయోగంగా వున్న అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ ను ప్రత్తిపాడు సిహెచ్ సి కి అందించేందుకు గల్లు అవకాశాలను పరిశీలించి వివరాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అదే ప్రాంగణంలో క్రొత్తగా నిర్మిస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రం అత్యవసర విభాగం మరియు ఓపి విభాగాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బిల్డింగ్ స్ట్రక్చర్ పనులు పూర్తి అయ్యాయని , నిర్మాణ ఏజెన్సీకి సంబంధించి పెండింగ్ లో వున్న బిల్లుల మొత్తాలను చెల్లించి మరో ఆరు మాసాల్లోపు పనులు పూర్తి చేయడం జరుగుతుందని సంబంధిత ఇంజనీర్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న శానిటేషన్ స్టాఫ్ మరియు సెక్యూరిటీ స్టాఫ్ తో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారికి ఇచ్చిన విధులు సక్రమంగా నిర్వహించాలని , ఆసుపత్రి శుభ్రతతో పాటు ఆసుపత్రి పరిసర ప్రాంతాన్ని కూడా పరిశుభ్రంగా వుంచాలన్నారు. రాత్రి పూట ఆరోగ్య కేంద్రంలో నర్సు , హెడ్ నర్స్ అందు బాటులో వుండాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో ఆరు బయట వున్న జనరేటర్ కు షెడ్ కట్టి వర్షాల వల్ల చెడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆర్డిఓ పి. శ్రీకర్ , డి సి హెచ్ ఎస్ డా. సుబ్రహ్మణ్య రాజు , మెడికల్ సూపరింటెండెంట్ డా. నాగార్జున , యంపీడీఓ దుర్గా ప్రసాద్ , తహశీల్దార్ రవి , సి హెచ్ సి డాక్టర్లు , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సచివాలయంలో సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. అటవీశాఖ అధికారులతో సమావేశం ముగిసిన తర్వాత పవన్... చంద్రబాబును కలిశారు. ఇరువురు పలు శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అంతకుముందు చంద్రబాబు... పరిశ్రమల శాఖపై సమీక్ష చేపట్టారు. ఈ సమీక్షలో మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పరిశ్రమల శాఖలో గత ఐదేళ్లుగా జరిగిన వ్యవహారాలపై చర్చించారు. 2014-19 మధ్య టీడీపీ హయాంలో రాష్ట్రానికి వచ్చిన పారిశ్రామికవేత్తలు 2019 తర్వాత వెనక్కి వెళ్లారని అధికారులు వివరించారు. పరిశ్రమలకు కేటాయించిన భూములు దుర్వినియోగం అయ్యాయని తెలిపారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ, కంపెనీలను తిరిగి రప్పించేందుకు గట్టిగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగించేందుకు వారితో తానే మాట్లాడతానని చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో భూముల లభ్యత, పారిశ్రామిక అనుకూల ప్రాంతాలపైనా ఈ సమీక్షలో చర్చించారు.

**ఆరోగ్యశ్రీపై తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవు:**

**మంత్రి కొలుసు పార్థసారథి**

ఆరోగ్యశ్రీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారంటూ మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. అబద్ధాలు ప్రచారం చేసే పత్రికలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ పథకంపై తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. బిల్లులు చెల్లించకపోవడంతో గతంలో అనేక ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశాయని మంత్రి పార్థసారథి వెల్లడించారు. పేదలకు వైద్యం అందకుండా చేసిన అసమర్థ పాలన జగన్ ది అని విమర్శించారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు.

# బడి ఈడు పిల్లల్ని గుర్తించి పాఠశాలలో చేర్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ గుంటూరు ఆర్ డి ఓ పి. శ్రీకర్ తో కలసి తనిఖీ చేశారు. జెడ్ పి ఉన్నత పాఠశాలలో గత ఏడాది 500 మంది పిల్లలు ఎన్రోల్మెంట్ కాగా, ఈ ఏడాది 400 మంది మాత్రమే తక్కువగా ఎన్రోల్మెంట్ కావడానికి ఉపాధ్యాయులు , సంబంధిత శాఖ అధికారుల నిర్లిప్తతతే కారణంగా తెలుస్తున్నదని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ అసహనాన్ని వ్యక్తపరిచారు. ఎన్రోల్మెంట్ పెంచేందుకు సచివాలయ , సమగ్ర శిక్ష సిబ్బంది , మండల ప్రత్యేక అధికారి , యంపీడీఓ లు టీముగా ఏర్పడి ఇంటింటికి వెళ్ళి బడి బయట పిల్లలను గుర్తించి ఎన్రోల్మెంట్ పెంచేందుకు బాధ్యతగా పని చేయాల న్నారు. దాదాపు రెండు ఎకరాల ప్రాంగణంలో ఉన్నత పాఠశాల అన్ని మౌలిక వసతులతో పాటు సరిపడ బోధన సిబ్బంది వుందన్నారు. స్కూల్ విద్యార్దుల ప్రమాణాలను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ద చూపాలన్నారు. వివిధ సబ్జెక్టులలో వెనుకబడినట్లుగా గుర్తించిన విద్యార్దులకు ప్రత్యేక శిక్షణ తరగతులు చేపట్టి వారు మంచి మార్కులతో ఉత్తీర్ణులు అయ్యేటట్లు కృషి చేయాల్సిన బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. స్కూల్ ప్రాంగణ స్థలాన్ని ఆన్లైన్ లో రిజిస్టర్ అయి వుండేటట్లుగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్దులు భుజిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా జిల్లా కలెక్టర్ రుచి చూసి మరింత నాణ్యతగా ఉండేటట్లు అందించాలని , అప్పుడే విద్యార్దులు అధిక సంఖ్యలో మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించేందుకు ఇష్ట పడతారని జిల్లా కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట గదిని , సరుకుల స్టాక్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. వంట గదిని పూర్తిగా ఎల్లవేళలా పరిశుభ్రంగా వుంచాలన్నారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కిచెన్ గార్డెన్ లో కూరగాయలను పెంచాలని , కనీసం వారంలో ఒకరోజు కిచెన్ గార్డెన్ లో పండిన కూరగాయలు , ఆకు కూరలతో మధ్యాహ్న భోజనంలో విద్యార్దులకు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్దులకు అందిస్తున్న ఆహారాన్ని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ టీచర్ పిల్లలకు నేర్పిస్తున్న రైమ్స్ , ఆల్ఫాబెట్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో వుంచిన బొమ్మలు , రంగులను పిల్లలు గుర్తించగలుగుతున్నారా అనే విషయాన్ని పరిశీలించారు. చిన్నారులతో జిల్లా కలెక్టర్ కొద్ది సేపు ముచ్చటించారు. చిన్నారులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేస్తూ వారి ఎత్తు , బరువులను రిజిస్టర్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి నిర్వహిస్తున్న రిజిస్టర్లను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పరిశీలించి సూచనలు అందించారు. చిన్నారుల ఆరోగ్యం , వారికి అందించే ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ద చూపాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏపీడీ విజయలక్ష్మీ , యంపీడీఓ దుర్గా ప్రసాద్ , తహశీల్దార్ రవి , మండల విద్యాధికారులు లీలా రాణి , రమాదేవి , పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

## పేరెంట్స్ కమిటీ స్థానంలో..స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ

**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** ఆంధ్రప్రదేశ్లో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం పాలనలో మార్పులు చేస్తోంది. గత ప్రభుత్వంలో అమలైన కొన్ని విధి విధానాలను మార్చుతూ నిర్ణయం తీసుకుంటున్నారు. ఇప్పటికే పలు రంగాల్లో సమూల మార్పులు తీసుకొచ్చిన ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో ఉండే పేరెంట్స్ కమిటీ స్థానంలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు.స్కూళ్లలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఇప్పటి వరకు పేరెంట్స్ కమిటీలు అమల్లో ఉన్నాయి. అయితే తాజాగా వీటిలో స్థానంలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలను అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగానే గురువారం మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాలను పర్యవేక్షించడం ఈ మేనేజ్మెంట్ కమిటీ విధులు. ఇక ఆగస్టు 8వ తేదీన ఇందుకు సంబంధించి ఎన్నికలను నిర్వహించనున్నారు. అదే రోజు కమిటీ ప్రమాణ కార్యక్రమం ఉంటుంది. అదే రోజు తొలి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న స్కూల్ పేరెంట్స్ కమిటీల పదవి కాలం బుధవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలో విద్యార్థుల తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించున్నారు.

## జగన్ రెడ్డి ఆర్భాటం కోసం ప్రజా సొమ్మును నాశనం చేస్తారా ?

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే గళ్ళా మాధవి పరిశీలించారు. ఈ సందర్భముగా 100కు పై కొత్త ఎలక్ట్రికల్ ఆటోలు వైసీపీ రంగులతో నిర్వహణ లేక నాశనం అయ్యి ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే వీటి గురించి ఆరా తీయగా మొత్తం 220 కొత్త ఎలక్ట్రికల్ ఆటోలు కొనుగోలు చేసారని, 60ఆటోలు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో తిరుగుతున్నాయని తెలిపారు. మిగిలిన వాటిలో రిపేర్ కు వచ్చాయని, తెలుపగా, స్థానిక నేతలు, ప్రజలు కొందరూ మాట్లాడుతూ... అప్పటి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి చేతుల మీదుగా 150 ఆటోలను ప్రారంభించేందుకు అప్పట్లో ఏర్పాటు చేసారని అది కూడా కుదరక పోవటంతో వీటిని షెడ్డుకు పరిమితం చేసారని ఆరోపించారు. ఆ సందర్భముగా గళ్ళా మాధవి అధికారులతో మాట్లాడుతూ... నగరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నదని అధికారులను అడిగితే, కావాల్సినన్ని యంత్రాలు అందుబాటులో లేవని తప్పించుకుంటున్నారని, మరి ఉన్న యంత్రాలను సక్రమంగా వినియోగించుకోకుండా, వీటిని పాడుబెట్టటం సమంజసం కాదని, అసలుకే ఎలక్ట్రికల్ వాహనాలు వాడకుండా వదిలేస్తే బ్యాటరీలు కూడా తీవ్రం పాడయిపోయే ప్రమాదం ఉన్నదని, కాబట్టి రంగులు ఏమి ఉన్న కూడా పట్టించుకోకుండా వెంటనే వీటికి మరమ్మత్తులు చేపించి వినియోగంలోకి తీసుకొనిరావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు.

## దేవరాజు సేవలు అమూల్యం



**గుంటూరు క్రైం, మేజర్ న్యూస్:** పోలీసు శాఖకు కానిస్టేబుల్ గా, హెడ్ కానిస్టేబుల్ గా దేవరాజు అందించిన సేవలు అమూల్యమని గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ డిఎస్పి మహేష్ అన్నారు. అరండల్ పేట పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న దేవరాజు పదవి విరమణ సత్కార కార్యక్రమం బుధవారం సాయంత్రం స్టేషన్ లో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో సిఐ కె శ్రీనివాసరావు, ఎస్సై రోజా లత, ఏఎస్ఐ లు నారాయణ, చంద్రమోహన్, హెడ్ కానిస్టేబుళ్ళు వాసు, శివ నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

## పదవి విరమణ చేసిన అధికారులను సత్కరించిన ఎస్పీ



**గుంటూరు క్రైం, మేజర్ న్యూస్:** గుంటూరు జిల్లా పోలీసు విభాగం లో పనిచేస్తూ పదవి విరమణ చేసిన 8 మంది అధికారులను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం రాత్రి ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికినారు వారి శేష జీవితం ఆరోగ్యంతో ఆనందంగా కుటుంబ సభ్యుల మధ్య గడపాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మనస్ఫూర్తిగా కోరుకుంటూ హృదయ పూర్వక పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆగస్టు 15 నుండి అన్నా క్యాంటీన్లు ప్రారంభం

**ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



**చిలకలూరిపేట, మేజర్ న్యూస్:** పట్టణంలోని అక్రమ రోడ్డు మార్జిన్ షాపులను తొలగిస్తాం ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండే విధంగా పట్టణంలో అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచే విధంగా రోడ్డు ఇరువైపులా అక్రమ మార్జిన్ ల తొలగిస్తాం ప్రజలకు సురక్షితంగా ఉండేవిధంగా కల్పిస్తాం. నేషనల్ హైవే ఇరువైపులా డ్రైనేజ్ మెరుగుపరుస్తాం ఎంత వర్షం వచ్చినా వర్షపు నీరు నిలువ ఉండకుండా ప్రజలు రోగాలు భారీ పడకుండా ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలిస్తూ శుభ్రపరిచే విధంగా ఈరోజు పట్టణంలో పలుచోటల పరిశీలించడం జరిగింది నేషనల్ హైవే వారితో కూడా మాట్లాడి స్పెషల్ డ్రైవ్ పెట్టిస్తాం. ఆగస్టు 15న అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తాం గత పాలకులు అన్నా క్యాంటీన్లను మూత వేశారు. పేద ప్రజల కడుపు నింపే అన్న క్యాంటీన్ని మరలా పున ప్రారంభిస్తాం. ప్రజలకు అన్ని అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం పని చేస్తుంది అంటూ మాజీ మంత్రివర్యులు ఎమ్మెల్యే పుల్లారావు అన్నారు.

## లోకేష్ చొరవతో పాఠశాల పునః ప్రారంభం



**వినుకొండ, మేజర్ న్యూస్ :** న్యూజెండ్ల మండలం కమ్మవారిపాలెం గ్రామంలో గత వైసిపి ప్రభుత్వం లో విద్యార్థులు లేరన్న నేపంతో నిర్లక్ష్యం చేసి ప్రభుత్వ పాఠశాలనుమూసి వేశారు.దీంతో విద్యార్థులు గ్రామంలో పాఠశాల లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.దీంతో టిడిపి గ్రామ నాయకులు గంగినేని రాధాకృష్ణ బాబు,మేదరమెట్ల శ్రీనివాసరావు,పాస్టర్ ప్రభుదాస్ లు స్థానిక శాసనసభ్యులు జీవి ఆంజనేయులు సహకారంతో విద్య,ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ ని కలిసి పాఠశాల పునరుద్ధరించాలని కోరారు.దీనిపై స్పందించిన లోకేష్ తిరిగి వెంటనే కమ్మవారిపాలెం ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించాలని సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారు.పేద మధ్యతరగతి ప్రజలకు చదువులు సరస్వతిని దరి చేర్చేందుకు లోకేష్ చూపిన చొరవపట్ల గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## కలిసి ఉంటే ముద్దు.. విడిపోవడం వద్దు



**వినుకొండ, మేజర్ న్యూస్ :** పట్టణంలోని మునిసిపల్ కాంప్లెక్స్ నందుగల మాల మహానాడు రాష్ట్ర కార్యాలయం నందు పలనాడు జిల్లా అధ్యక్షులు మైనర్ బాబు ఆధ్వర్యంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పౌలు పాల్గొని హలోమాల చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పౌలు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను రాజ్యాంగ బద్ధంగా న్యాయబద్ధంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందని,దేశంలోని దళితులు ఐక్యంగా ఉంటే మనువాద అగ్రకుల రాజకీయ పార్టీల ఆటలు సాగవని అన్నాతమ్ములుగా ఉన్న మాలా మాదిగల మధ్య విభజన రేఖ గిస్తూ ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తీసుకురావడం సిగ్గుచేటని అన్నారు.కలసి ఉంటే ముద్దు విడిపోవడం వద్దు అనే నినాదంతో ఈ రాష్ట్రంలోని మాలలంతా ఢిల్లీ నడిబొడ్డులో 8వ తారీఖున జరగనున్న హలో మాల చలో ఢిల్లీ మహా ధర్నాలో అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జంగా కృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిపూడి ఏసురత్నం, నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు బడుగు సాల్మన్, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ కొట్టెల కమలాకర్, అన్ని మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.





# ఇరిగేషన్ వ్యవస్థను విధ్వంసం చేసిన జగన్

- ఐదేళ్లలో కాలువలపై తట్ట మట్టి కూడా వేయని వైసిపి ప్రభుత్వం
- ఇరిగేషన్ శాఖలో పెండింగ్‌లో 18 వేల కోట్లు బిల్లులు
- ఎన్డీఏ రైతు సంక్షేమ ప్రభుత్వం
- సమస్యలను అధిగమించి రైతును ఆదుకుంటాం
- ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు

**వినుకొండ, మేజర్ న్యూస్ :** ఐదేళ్ల వైసిపి పాలనలో జగన్ రెడ్డి రాష్ట్రంలోని ఇరిగేషన్ వ్యవస్థను విధ్వంసం చేసి రైతును నట్టేట ముంచాడని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.శ్రీశైలం వెళ్లి వస్తున్న మంత్రని మార్గమధ్యలో గల చీకటి గలపాలెం అడ్డరోడ్డు వద్ద ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం రైతులు కలిశారు.ఈ సందర్భంగా ఆయన గుండ్లకమ్మ నదిని పరిశీలించారు.అనంతరం మంత్రి రామానాయుడు విలేకరులతో మాట్లాడుతూ నీటిపారుద శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన 45 రోజుల్లో తాను ఉత్తరాంధ్ర, పెన్నా, రాయలసీమ, అన్నిచోట్ల నీటి ప్రాజెక్టులను పరిశీలించడం జరిగిందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్మోహన్ రెడ్డి తాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది లేదని,సమస్యలు ఉన్నచోట కనీసం మరమ్మత్తులకు కూడా కాలువలపై ఒక తట్ట మట్టి వేసిన పాపాన పోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కాలువలపై డోర్లు,షట్టర్లు,రోప్స్,పరికరాలకు కనీసం గ్రీస్ కూడా వేయించిన పాపాన పోలేదన్నారు.కాలువలు పరిశీలిస్తే చెట్లు వేపుగా పెరిగి సాగునీరు, త్రాగునీరు దిగువకు చేరే పరిస్థితి ఎక్కడ లేదన్నారు. ఇలా ఇరిగేషన్ వ్యవస్థను అస్తవ్యస్తం చేసి రైతులకు తీరని అన్యాయం చేశారని అన్నారు. రాష్ట్రానికి నిధుల సమస్య అధికంగా ఉందని, ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో అప్పుల ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇరిగేషన్ శాఖలో 18 వేల కోట్ల బిల్లులు పెండింగ్లో ఉన్నాయని, వాడిని అధిగమించే పనిలో ఉన్నామన్నారు. ఎన్డీఏ నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వ్యవసాయాన్ని రైతులను కాపాడుకునేందుకు పనిచేస్తుందన్నారు. ఎటువంటి సవాళ్లైనా ఎదుర్కొని సమస్యను అధికమిస్తామని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రంలో రైతు పక్షపాత ప్రభుత్వంకొనసాగుతుందని వివరించారు.పల్నాడు జిల్లా ప్రజలు దాహార్తిని తీర్చాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తమ దృష్టికి సమస్యను తీసుకురాగా సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో కృష్ణ రివర్ బోర్డుతో చర్చించి కుడికాలువకు ఐదు టీఎంసీల నీటిని త్రాగునీటి అవసరాలకు విడుదల చేయడం జరిగిందన్నారు. కృష్ణ డెల్టాకు, రైట్ కెనాల్ కు నీటి ప్రాధాన్యతపై రివ్యూ చేసి నీటి విడుదల కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు మాట్లాడుతూ పల్నాడు జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎన్ఎస్పి కుడికాలువకు త్రాగునీరు విడుదలకై మంత్రి నిమ్మల రామానాయుడు చేసిన కృషి అభినందనీయమని అన్నారు.గుండ్లకమ్మ వాగుకు, ఈపూరు చెరువుకు నాగార్జునసాగర్ మెయిన్ కెనాల్ నుండి నీటి విడుదలపై తూము అనుమతి కల్పించాలని కోరారు.గతంలో వినుకొండ మండలం కనుముల చెరువు,పెద్ద కంచర్ల చెరువులకు ఏవిధంగా ఎన్ఎస్పి నుండి తూము అనుమతి ఇచ్చారో అదేవిధంగా అనుమతులు ఇప్పించాలని కోరారు.గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో అనేక గ్రామాల రక్షిత మంచినీటి పథకాలు,గిరిజన రేషన్షియల్ స్కూల్లకు మంచినీటి పథకాలు ఉన్నాయని, వేసవి సమయంలో గుళ్ళకమ్మ ఎండిపోయి త్రాగునీరు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అలాగే 36 కిలోమీటర్లు ఉన్న గుండ్లకమ్మ నదిపై చెక్ డామ్ ల నిర్మాణం చేపట్టాలని కోరారు.ఈప్రాంత ప్రజలను ఆదుకునేందుకు మెయిన్ కెనాల్ నుండి తూము అనుమతి ఇవ్వవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.స్పందించిన మంత్రి రామానాయుడు మాట్లాడుతూతప్పనిసరిగా తూము అనుమతులు కల్పిస్తామని,అంచనాల తయారుచేసి గుండ్లకమ్మ పై చెక్ డ్యాములు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**సీఎం చంద్రబాబు నేడు శ్రీశైలంకు రాక**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 1వ తేదీ గురువారం శ్రీశైలం రానున్నట్లు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.శ్రీశైలం డ్యాం నుండి గేట్లు ఎత్తి నాగార్జునసాగర్ డ్యామ్‌కు నీరు విడుదల చేయడంతో సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదగా జలహారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు,మాదినేని ఆంజనేయులు, ముత్తినేని ఏడుకొండలు, మీసాల మురళీకృష్ణ, కర్నాటి వెంకటేశ్వర్ రెడ్డి, మద్దుకూరాం బ్రహ్మం, టిడిపి నాయకులు, నియోజకవర్గ రైతులు, ఎన్ఎస్పి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో పారిశుద్ధ్య చర్యలు



**క్రోసూరు, మేజర్ న్యూస్ :** క్రోసూరు మండలంలోని అన్నీ గ్రామాలలో పంచాయతీ కార్మికులు బుధవారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామాలలోని పలు కూడళ్ళ వద్ద, సైడు కాల్వల్లో పేరుకుపోయిన చెత్త చెదారం లను తొలగించి వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. మురుగు కాల్వల్లో దోమల నివారణకు రసాయన మందును పిచికారీ జరిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపించి ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ఎంపీడీఓ వెంకటరమణ తెలియజేసారు. గ్రామంలో ఎక్కడయినా అపరిశుభ్ర పరిస్థితి కనిపిస్తే పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించాలని సూచించారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి : ఎమ్మెల్యే జూలకంటి

**మాచర్ల, మేజర్ న్యూస్ :** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాచర్ల పట్టణంలో నిర్వహించిన స్వర్గీయ జూలకంటి నాగిరెడ్డి మెమోరియల్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి సయ్యద్ అన్వర్ భాష ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించారు. మొదటి బహుమతి పల్నాడు ఓవర్సీస్ జట్టు రూ.1,33,318 నగదు బహుమతి గెలుచుకోగా రెండవ బహుమతి ఎస్ ఆర్ తండా జట్టు రూ.93,318లు, మూడవ బహుమతి పెద్దారెడ్డి జట్టు రూ.63,318లు, నాలుగవ బహుమతి నరేంద్ర జట్టు రూ.33,318లు గెలుచుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ రాజు కు రూ.10 వేల నగదు తో పాటు బెస్ట్ బ్యాట్స్ మెన్ క్రింద ఇంగ్లీష్ విల్లో బ్యాటు అందజేశారు. బెస్ట్ బౌలర్ గా ఎన్నికైన కోటికి అడిడాస్ షూస్ అందజేశారు. విజేతలందరిని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జూలకంటి అక్కిరెడ్డి,సయ్యద్ అన్వర్ భాష, జూలకంటి చిరంజీవిరెడ్డి, పులుసు ప్రతాపరెడ్డి, పంగులూరి పుల్లయ్య,రామ టాకీస్ జానీ, గోరంట్ల ధీరజ్, దొండపాటి శివనాగు,గోరంట్ల శ్రీ వాత్సవ్ పార్టీ నాయకులు కార్యకర్తలు క్రీడాకారులు పాల్గొన్నారు.



# సమిష్టిగా కలిసి పని చేద్దాం - సత్తెనపల్లి రూపు రేఖలు మారుద్దాం





## ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** ఎన్నికల వరకే రాజకీయాలని ఎన్నికల తర్వాత కేవలం నియోజకవర్గం అభివృద్ధిపై మాత్రమే దృష్టి పెట్టి సత్తెనపల్లి రూపురేఖలను మార్చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు బుధవారం సత్తెనపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మి తులసి నేతృత్వంలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే కన్నా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొద్ది రోజుల క్రితం జరిగిన ఎన్నికల్లో సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీతో నన్ను గెలిపించారని,ఓటు వేసి గెలిపించిన ప్రతి వారికి పేరు పేరున రుణపడి ఉంటానని తెలిపారు.సత్తెనపల్లికి అవసరమైన నిధులు నా ద్వారా,సహచర మంత్రులు దృష్టికి తీసుకువెళ్లి నిధులు సమకూరుస్తానన్నారు. గత ఏడాది నుండి సత్తెనపల్లి పట్టణంలో తిరుగుతున్నానని, పట్టణంపై నాకు ఓ అవగాహన ఉందని, ప్రత్యేకంగా తీర్చి దిద్దడానికి ఓ ప్రణాళిక పరంగా ముందుకు వెళతామన్నారు. మున్సిపల్ అజెండాలో 48 అంశాలు కౌన్సిల్ ఆమోదానికి పెట్టగా వాటిని అందరూ ఆమోదించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చేతుల మీదగా బట్టలు,నిత్యావసర వస్తువులు చైర్పర్సన్ కమిషనర్ షమ్మీ తో కలసి పంపిణీ చేశారు.మొట్ట మొదటిగా పురపాలక సంఘం కార్యాలయంకు ఎమ్మెల్యే స్థాయిలో వచ్చిన కన్నాను ఆఫీస్ అధికారులు ఘనంగా సత్కరించారు. చైర్ పర్సన్ లక్ష్మి తులసి ఆమె భర్త కలసి కన్నాక పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ కమిషనర్ షమ్మి,వార్డు కౌన్సిలర్లు, వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేజర్ డ్రెయిన్లను ఆధునీకరిస్తాం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**చిలకలూరిపేట, మేజర్ న్యూస్:** పట్టణంలో మురుగు నీరు ప్రధానంగా ప్రవహించే మేజర్ డ్రెయిన్ లు రెండు జాతీయ రహదారికి ఇరువైపులా సిల్ట్ తో పూడిపోయి మురుగు నీరు ప్రవహించే పరిస్థితి లేకుండా పోయిందని,ఈ పరిస్థితిని వారంలో పరిష్కరించాలని ప్రత్తిపాటి పుల్లారావు మునిసిపల్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఉదయం జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ప్రధాన మేజర్ మురుగు కాల్వలను ఆకస్మికంగా పరిశీలించారు. ఏఎంజీ ఎదురుగా కుప్పగంజి వాగులోకి ప్రవహించే కాల్వను పరిశీలించారు. అనంతరం సాయి కార్తీక్ సినిమా హాలు ముందు ఓగేరు వాగులోకి ప్రవహించే మేజర్ మురుగు కాల్వ పూడిపోయిన స్థితి ని పరిశీలించారు. అనంతరం అసిస్ట్ ఎదురుగా ఉన్న మురుగు నీటి కాల్వను పరిశీలించడం జరిగింది.అక్కడ స్థానికులు పాముల సంచారం ఎక్కువగా ఉందని ఫిర్యాదు చేశారు.అనంతరం గడియార స్తంభం సెంటర్ వద్ద జరుగుతున్న అన్నా క్యాంటీన్ పునరుద్దరణ పనులను పరిశీలించారు. అనంతరం చేపల మార్కెట్, మటన్ మార్కెట్ షాపులను సందర్శించి, నిర్మాణం ఆగిపోయిన సదరు ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం గాంధీ పార్కు ను సందర్శించడం జరిగింది.ఈ సంధర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ పట్టణ పారిశుధ్యానికి ప్రధాన వనరులైన జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న రెండు మేజర్ డ్రెయిన్ లలో సిల్ట్ ను తక్షణమే తీయించే విధంగా పనులు మొదలు పెట్టాలని, జాతీయ రహదారుల అధికారి పార్వతీశం తో సమస్య పై ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడగా, వారు మేజర్ డ్రైన్ అంచనాలు తయారు చేసి జాతీయ రహదారుల సంస్థ వారికి పంపాలని తెలిపారు. ఆగష్టు 15 వ తారీఖు నుండీ పట్టణంలో 3 అన్నా క్యాంటీన్ లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మటన్ మార్కెట్ నిర్మాణాన్ని ఒక ప్రణాళికా బద్ధంగా పూర్తి చేద్దామని షాపుల యజమానులకు భరోసా ఇచ్చారు.గాంధీ పార్కు ను ఆధునీకరించి , వాకింగ్ ట్రాక్ ను ఏర్పాటు చేయాలని, గ్రీనరీని పెంచాలని అధికారులను ఆదేశించారు.

# ఘనంగా రోటరీ క్లబ్ చిలకలూరిపేట నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**చిలకలూరిపేట, మేజర్న్యూస్:** రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవం మంగళవారం రాత్రి నరసరావుపేట రోడ్డులోని రోటరీ కమ్యూనిటీ హాల్ నందు ఘనంగా నిర్వహించారు. అధ్యక్షులుగా ఆళ్ల వేమన రెడ్డి, కార్యదర్శిగా ఉప్పుటూరి ప్రసాద్, కోశాధికారిగా కటకం శివరాం ప్రసాద్ ఇతర కార్యవర్గ సభ్యుల చేత రోటరీ 3150 గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ శివరాం ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్. వి.రాం ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలియజేశారు. నూతన కార్యవర్గం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పి.శివరంజని, కొల్లా శ్రీనివాసరావు, కాపు వెంకట్రావు, తోటకూర వెంకటనారాయణలు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా మాజీ గవర్నర్ జాస్తిరంగారావు, మాజీ శాసన సభ్యురాలు డాక్టర్ కందిమల్ల జయమ్మ, కందిమల్ల అంజి బాబు, డాక్టర్ కందిమల్ల సాంబశివరావు, దండా గోపి, గల్లా సాంబశివరావు, ఆలేటి




ప్రసాదరావు, ఉప్పుటూరి ప్రసాదు, కటకం శివరాం ప్రసాద్, కరణం శివ, క్లబ్ సభ్యులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో రోటరీ వ్యవస్థాపకులు పాల్ హారీస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

## ఘనంగా కొమ్మలపాటి ఉద్యోగ విరమణ



**వినుకొండ, మేజర్ న్యూస్ :** స్థానిక శృంగారవనం ప్రాథమిక పాఠశాల ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం కొమ్మాలపాటి సోమశేఖర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ముఖ్యఅతిధులుగా ఎంఈఓ సయ్యద్ జఫ్రుల్లా ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ సోమశేఖర్ 34 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలందించి ఎందరో విద్యార్థినీ విద్యార్థుల బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్ది నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అన్నారు.ఎస్ జి టి గా తమ ప్రస్థానాన్ని ప్రారంభించి ప్రధానోపాధ్యాయులుగా నేడు పదవి విరమణ చేయడం సంతోషంగా ఉందన్నారు. వారు పాత హసన్నాయునిపాలెం,చీకటీగల పాలెం,వినుకొండ పట్టణం, జాషువా నగర్, కమ్మవారిపాలెం, నడిగడ్డ, శృంగార వనం పాఠశాలలో విధులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సహచర ఉపాధ్యాయులు, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ కవికి అవార్డు



**వినుకొండ, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ గుఱ్ఱం జాషువా స్మాల్ కళాపరిషత్ దుగ్గిరాల వారి ఆధ్వర్యంలో తెనాలిలో జరిగిన జాషువా వర్ధంతి కార్యక్రమంలో వినుకొండకు చెందిన ప్రముఖ కవికి అవార్డు రావడం జరిగింది. పట్టణానికి చెందిన ప్రముఖ కవి జి కమలారాం ని గుర్రం జాషువా స్మాల్ కళాపరిషత్ వారు కళాసాహిత్య భూషణ్ అవార్డుతో సత్కరించటం జరిగిందని సమాఖ్య అధ్యక్షులు యోహాను బుధవారం ప్రకటన ద్వారా తెలియజేశారు. పలువురు ప్రముఖుల,ముఖ్య అతిథుల సమక్షంలో సన్మానం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కమలారామ్ ను పట్టణంలోని పలువురు కవులు, కళాకారులు, ప్రముఖులు అభినందించారు.

## ప్రైవేటు విద్యాసంస్థల ప్రిన్సిపల్స్‌తో యం.ఈ.ఓల సమావేశం



**కారంపూడి, మేజర్ న్యూస్ :** స్థానిక కారంపూడి నందు గల మానవ వనరుల విద్యా కేంద్రంలో యం.ఈ.ఓ 1 కాంతారావు, యం.ఈ.ఓ 2రవి కుమార్ అధ్యక్షతన ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపల్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.కాంతారావు,రవి కుమార్, మాట్లాడుతూ పిల్లల అందరికీ సరిపడ ఆహ్లాదకరమైన వాతావరణంలో చక్కటి విద్యను అందించేందుకు కృషి చేయాలని కోరారు.పాఠశాలకు సంభందించి విద్య పరమైన సమస్యలు ఏమైనా వుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.సకాలంలో పిల్లలకు పాఠాలను బోధించి, వారిని రాబోయే పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు.వెనుకబడిన విద్యార్థులను గుర్తించి,వారిపైన ప్రత్యేక శ్రద్ధ చూపి,అవసరం అయితే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అక్షర స్కూల్ ప్రిన్సిపాల్ ఔకు ప్రసాద్,జయకృష్ణ, రెయిన్ బో స్కూల్ ప్రిన్సిపాల్ వెంకట్రావు,లింగారెడ్డి, సెయింట్ జాన్స్ హెడ్ మిస్ట్రెస్ సిస్టర్. బినోమా, శీరాపాని,వివేకానంద ప్రిన్సిపాల్ విశాలాక్షి ,సమూయేలు, బాల భాను విద్యాలయం ప్రిన్సిపాల్ విష్ణు ప్రియ,దివ్య సాయి ప్రిన్సిపాల్ ప్రసాద్,వెంకటరావు పాల్గొనడం జరిగింది.

## ప్రధానోపాధ్యాయుని పదవీ విరమణ కార్యక్రమం



**ఈపూరు, మేజర్ న్యూస్ :** ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుని ఎం ఎం మాధురి పదవి విరమణ కార్యక్రమాన్ని బుధవారం పాఠశాల ప్రాంగణంలో ఘనగా నిర్వహించారు.సభలో మండల విద్యాశాఖ అధికారులు,పలువురు ఉపాధ్యాయులు పాల్గొని మాట్లాడుతూ పాఠశాలకు,విద్యార్థులకు ఆమె అందించిన సేవలను కొనియాడారు. విద్యార్థులను సరైన పద్ధతిలో తీర్చిదిద్దే బాధ్యత నిర్వహించినటువంటి ఉపాధ్యాయులు యొక్క జీవితం ధన్యం అని, అలాంటి పాత్ర ఆమె ఎంతో పోషించిందన్నారు.పని చేసినటు వంటి ఉపాధ్యాయ వృత్తికి తాను గౌరవం తీసుకొచ్చారని,ఇలాంటివారు సమాజానికి ఆదర్శమని కొనియాడారు.ఈకార్యక్రమంలో ఎంఈఓ లు సయ్యద్ జఫరుల్లా,రామ తులసి,పలువురు ఉపాధ్యాయ యూనియన్ నాయకులు, సహచర ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్నం భోజనం తనిఖీ

**క్రోసూరు, మేజర్ న్యూస్ :** క్రోసూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం మధ్యాహ్నం భోజనంను జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గార్లపాటి దాసు పరిశీలించారు. పాఠశాలలో 540 మంది విద్యార్థినీవిద్యార్థులు హాజరవుగా కేవలం 120 మంది పిల్లలు భోజనం తినటాన్ని ఆశ్చర్యపడి వంట వండే ఆమెను పిల్లలకు సరిపడా నిత్యవసర వస్తువులు ఇవ్వటం లేదని అడగ్గా బియ్యం కందిపప్పు కోడిగుడ్లు మాత్రమే ఇస్తారు మిగతావి నేనే తీసుకొచ్చి వంట చేస్తాను నేను గత 20 సంవత్సరాలు నుండి వంట వండి



పిల్లలు తినేవరకు మెనూ ప్రకారం ఇస్తూ ప్రతిరోజు కోడిగుడ్లు మాత్రం అందరి పిల్లలకు అందిస్తున్నామని బదులిచ్చారు. ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులును కలిసి ఈ విషయాన్ని తెలియజేయటం తో పాటు పాఠశాలలో ఆర్ ఓ ప్లాంట్ లేక త్రాగు నీరు లేక పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారని హైస్కూల్లో బెంచీలు కుర్చీలు తక్కువగా ఉన్నాయి అని తెలిపారు.. పిల్లలకు సక్రమంగా బుక్స్ డ్రెస్సు షూస్ 6 వ తరగతి 16 మందికి బుక్స్ ఇవ్వలేదని తెలిపినారు. బయట పిల్లల తల్లితండ్రులను విచారణ చేయగా ఆమె సక్రమంగా వంట చేయడం లేదన్నారు. ఈ విషయాలను జిల్లా కలెక్టర్ గారికి దృష్టికి తీసుకెళ్తామని గార్లపాటి దాసు అన్నారు.

## ఒప్పిచర్ల గ్రామానికి ఆదర్శంగా టీడీపీ యువనేత పంగులూరి శ్రీనివాసరావు



**కారంపూడి, మేజర్ న్యూస్ :** ఆ యువనేత గ్రామానికే ఆదర్శంగా నిలుస్తూ అందరి మన్న నలు పొందు చున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి ఒక మూల స్తంభం లా నిలుస్తూ కార్యకర్తల కష్టాలను వింటూ తన పరిధిలో అందరికి సహాయం చేస్తూ చేదోడువాదోడుగా ఉంటున్నారు. తెలుగుదేశం పార్టీ తరపున చురుకుగా ఉంటూ గ్రామంలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటూ వారు ఆపదలో ఉన్నప్పుడు ఆపన్న హస్తం అందిస్తూ తలలో నాలుకలా మెలుగుతున్నారు.ఎన్నికల హామీలో భాగంగా అసలు రోడ్ వసతి లేని ముస్లిం బజారులో కొత్తగా తన స్వంత ఖర్చుతో మట్టి తోలించి, ఆరోడ్డు సరిచేయించి, ఆ వీధి రోడ్డు ను బాగు చేయించారు.వర్షం వస్తే చిత్తడి, చిత్తడిగా అయ్యే ఈ రోడ్డు, ఇప్పుడు కళకళలాడుతోంది అంటే ఈ యువనేత చలవే అని గ్రామస్తులు అంటున్నారు.ఇలాంటి ప్రజాప్రయోజన పనులు ఖర్చుకు వెనుకాడకుండా తన స్వంత డబ్బును వెచ్చిస్తున్నారు.మా కన్నతల్లి తో సమానమైన మా గ్రామం లో ఏ ఇబ్బంది ఉన్నా నేను అవి పరిష్కరించడానికి సిద్ధంగా ఉంటానని యువనేత శ్రీనివాసరావు వెల్లడించారు.గ్రామస్తుల బాగోగులే తన ధ్యేయం అని ఆయన చెప్తున్నారు. ఇంకా ఏదైనా పనులు ఉంటే ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి దృషికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని ఆయన తెలియజేసారు.

# అణగారిన ప్రజల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం చర్యలు

- వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీల దగా
- జనసేన పార్టీ సెంట్రెల్ ఆంధ్ర కో- కన్వీనర్ పెంటేల బాలాజి

**చిలకలూరిపేట, మేజర్ న్యూస్**

ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపటానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఆయా వర్గాల ప్రజల్లో సంతోషాన్ని నింపుతున్నాయని జనసేన పార్టీ సెంట్రెల్ ఆంధ్ర కో- కన్వీనర్ పెంటేల బాలాజి చెప్పారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో బాలాజి మాట్లాడుతూ కొండకోనల్లో కష్టాలతో సహవాసం చేస్తున్న గిరిజనులకు మేలు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని, ఆర్థికంగా అత్యంత వెనకబడి ఉండే దళిత వర్గాలకు ఆర్థిక భద్రత కల్పించే కార్యక్రమాలు రూపొందించాలని సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేశారని వల్లడించారు. ఎస్సీ, ఎస్టీలకు మంచి చేయాలన్న సంకల్పం ఉన్న ప్రభుత్వం ఇదని, వారి అభ్యున్నతి, సంక్షేమం కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమౌతుందన్నారు.

**వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీల దగా**

నా ఎస్సీ, నా ఎస్టీ అని ఊదరగొడుతూనే దగా చేశారని, అణగారినవర్గాల ఉన్నతి కోసం అనాదిగా అమల్లో ఉన్న ప్రభుత్వ పథకాలు పీకిపారేశారని. ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక అమలును అటకెక్కిం చారని బాలాజి మండి పడ్డారు. ఎస్సీ, ఎస్టీలకు ఖర్చు చేసిన నిధుల్లోనూ 90 శాతానికిపైగా నవరత్న పథకాలకే వినియోగిం చారు. చివరకు అందరికీ ఇచ్చే పింఛన్లు, ఉపకారవేతనాల కింద ఇచ్చే సాయానికీ ఉపప్రణాళిక నిధుల్నే వినియోగించారని వివరించారు. జగనన్న గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాల కింద చిన్నారులకిచ్చే గుడ్డు, మధ్యాహ్న భోజనం లెక్కల్ని కూడా ఇందులోనే చూపించారని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సాంఘిక సంక్షేమశాఖకు కేటాయించిన నిధుల్లో 83% ఖర్చు చేస్తే.... వైసీపీ ప్రభుత్వ హయాంలో 67 శాతమే వెచ్చించారని తెలిపారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి, సివిల్ సర్వీసెస్ శిక్షణ కోసం ఎన్టీఆర్ విద్యోన్నతి, బెస్ట్ ఎవైలబుల్ స్కూల్స్, చంద్రన్న పెళ్లికానుక లాంటి పథకాలను అటకెక్కించి, ఆయా వర్గాలకు తీరని ద్రోహం చేశారని వెల్లడించారు.

అణగారిన ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం కూటమి ప్రభుత్వ పాలనలో దళితుల అభ్యున్నతికి, సంక్షేమానికి పలు పథకాలు ప్రవేశపెట్టనున్నారని



తెలిపారు. గత టీడీపీల్లో ఉండి, వైసీపీ ప్రభుత్వం నిలిపేసిన ఆదివాసీ గర్భిణీ వసతి గృహాలను పునరుద్ధరించనున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 543 గిరిజన పాఠశాలలు, ప్రీ, పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో ఏఎన్ఎం సేవలు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. గిరిజన యువత ఉపాధి కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆర్థికంగా అత్యంత వెనకబడి ఉండే దళిత వర్గాలకు ఆర్థిక భద్రత కల్పించే కార్యక్రమాలు రూపొందించాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. అణగారినవర్గాల ఉన్నతి కోసం కూటమి ప్రభుత్వం రానున్న కాలంలో మరెన్ని పథకాలు రూపొందించనుందన్నారు.

# పాఠశాలకు స్నేహ హస్తాలు ఫౌండేషన్ చేయూత

### ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ నెల్లూరి రమేష్ పాఠశాలకు బీరువా బహుకరణ

**పెద్దకూరపాడు, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పెదకూరపాడు ఎంపీపీ హెచ్.డబ్యూ. స్కూల్‌కు స్నేహ హస్తాలు ఫౌండేషన్ వారు డిజిటల్ టీవీ మరియు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, ఆట వస్తువులు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ నెల్లూరు రమేష్ మరియు పెదకూరపాడు గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు , మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నెల్లూరు రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సర్పంచ్ గుడిపూడి రాజు మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి స్నేహ హస్తాల వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు చాలా గొప్పవని అన్నారు. యం.ఇ.వో. సత్యనారాయణ మాట్లాడుతూ స్నేహ హస్తాల వారు మన మండలంలోని పాఠశాలను ఎంపిక చేయడం చాలా మంచి విషయమని స్నేహ స్థల ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ నెల్లూరు రమేష్ 15వేల రూపాయల విలువ గల బీరువాని పాఠశాలకు బహుకరించారు.



పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దర్శి నిర్మల డిజిటల్ టీవీ కోసం 6 వేల రూపాయలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో స్నేహ హస్తాలు ఫౌండేషన్ కోఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, ఉపాధ్యాయులు అనిత, న్యామతుల్లా, బెల్లం వెంకటప్పయ్య , విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ చట్టాలు పాటిద్దాం - రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

### ప్యానల్ న్యాయవాది ఆకుల నాగార్జున

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్:** మండలంలోని ఫణిధం గ్రామంలో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం యొక్క ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వెంకట నాగ శ్రీనివాసరావు సత్తెనపల్లి వారి సూచనల మేరకు మోటారు వాహనాల చట్టం గురించి న్యాయ విజ్ఞాన సదస్సు ఫణిధం గ్రామంలో



నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ న్యాయవాది ఆకుల నాగార్జున మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వార సులభంగా రోడ్డు ప్రమాదాలను నివారించ వచ్చని తెలిపారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ షేక్ ముబారక్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎవరైనా ద్విచక్ర వాహనాలను మైనర్లకు ఇవ్వొద్దని తెలియజేశారు. ఈ సందర్బంగా పారా లీగల్ వాలంటీర్ షేక్ సుభాని మాట్లాడుతూ ద్విచక్ర వాహనం పై ముగ్గురు ప్రయాణించటం, హెల్మెట్ ధరించక పోవటం ప్రమాదమని హెచ్చరించారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటిర్ షేక్ ఖాజా వలి, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గంటలో ఎల్ఐసి పాలసీ క్లైమ్ పరిష్కారం



**వినుకొండ, మేజర్ న్యూస్ :** ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో గంట వ్యవధిలో పాలసీ క్లైమ్ ను సీనియర్ బ్రాంచ్ మేనేజర్ డి శ్రీనివాసరావు బుధవారం పరిష్కారం చేశారు.శావల్యాపురం గ్రామానికి చెందిన చీమలదిన్నె అచ్చయ్య మృతి చెందడంతో పాలసీ చేసిన సీనియర్ ఏజెంట్, ఎండిఆర్టి ఎస్ కోటేశ్వరరావు తక్షణమే క్లెయిమ్ ఫారాలు పూర్తిచేసి కార్యాలయంలో అందజేశారు.బ్రాంచ్ మేనేజర్ ఆదేశాల మేరకు క్లెయిమ్స్ ఏవో ఆర్ రత్నరాజు,ప్రసన్న గంట వ్యవధిలో క్లైమ్ పరిష్కారం చేయడం జరిగింది.నగదును నామిని అయిన మృతుడు సతీమణి పేరమ్మ బ్యాంకు అకౌంట్లో జమ చేశారు.అందుకు సంబంధించిన ఓచర్ ను బ్రాంచ్ మేనేజర్,సిబ్బంది, ఏజెంట్ ఆధ్వర్యంలో పేరమ్మకు అందజేశారు.తన భర్త పాలసీకి సంబంధించిన క్లైమ్ నగదును వెంటనే ఇచ్చినందుకు పేరమ్మ ఎల్ఐసి అధికారులకు,ఏజెంట్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# పెన్షన్‌దారులకు పెద్దన్నగా సీఎం చంద్రబాబు

పెదకూరపాడు, మేజర్ న్యూస్

పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా తెదేపా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్దన్నగా ప్రతి నెల 1వ తేదీన ఇంటి వద్దకు పింఛన్లు అందించేందుకు శ్రీకారం చుట్టారని కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ప్రభుత్వ అధికారులు, పార్టీల నాయకులు ఇంటింటికి తిరిగి పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నారా చంద్రబాబు నాయుడు ప్రజల కోసం అహర్నిశలు పాటుపడుతున్నారని శ్రీధర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఇంటింటికి పింఛన్ అందించడంలో ఎటువంటి జాప్యం లేకుండా ఆదేశాలు ఇవ్వటం, పార్టీ క్యాడర్ అధికారులు సమన్వయంతో పని చేయటం పింఛన్ దారులకు నేరుగా అందించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల లోపు అధికార యంత్రాంగంతో పాటు వార్డులలో వార్డు ప్రెసిడెంట్లు, పంచాయతీలలో పంచాయతీ ప్రెసిడెంట్లు ఇంటింటికి తిరిగి పెన్షన్లను లబ్దిదారులకు అందజేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ నగదు పెంచి లబ్దిదారులకు అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు.

- పెన్షన్ల పంపిణీలో పార్టీ నాయకులు అందరూ భాగస్వామ్యం కావాలి
- ఉదయం నుంచే పెన్షన్లు పంపిణీ చేయాలి
- జిల్లా పార్టీ నాయకులకు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపు



## ఇంటి వద్దకే పెన్షన్.. ఎంపీడీవో శంకరరావు



రెంటచింతల, మేజర్ న్యూస్ : ఆగస్టు 1వ తారీఖున పెన్షన్ల పంపిణీ కార్యక్రమము ఉదయం 6 గంటల నుండి పెన్షన్ల పంపిణీ చేసేందుకు సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే ప్రతి ఒక్కరికి పెన్షన్ పంపిణీ చేయగలరని. ఎంపీడీవో శంకరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామంలోని 7042 మంది పెన్షన్ లబ్దిదారులందరూ ఒకటవ తేదీన ఎక్కడికి వెళ్లకుండా అందరూ ఇండ్ల వద్దనే ఉండవలసినదిగా కోరారు. 100కు 99 శాతం పెన్షన్లు ఒకటవ తేదీనే పంచబడును రెండవ తారీకున ఎవరైనా ఆసుపత్రికి వెళ్లిన వేలిముద్రలు పడకపోయిన వారికి మాత్రమే రెండవ తారీకున ఇవ్వబడును. పెన్షన్ లబ్దిదారులందరూ సాధ్యమైనంత వరకు ఒకటో తారీఖున అందరూ ఇంటి వద్దనే అందుబాటులో ఉండవలసినదిగా తెలియజేశారు. ఒకవేళ అనివార్య కారణాల వల్ల ఎవరైనా ఇంటి వద్ద లేకపోయినట్లయితే రెండవ తారీఖున వారికి పెన్షన్ అందజేస్తారన్నారు. మూడో తారీకున సైట్ క్లోజ్ అగును. కావున ఒకటి రెండు తారీకులలో మాత్రమే పెన్షన్ పంపిణీ చేయబడును. అందరూ లబ్దిదారులు గ్రామంలో వారి ఇండ్ల వద్ద అందుబాటులో ఉండి, పెన్షన్ సొమ్ము పొందాలని ఎంపిడిఓ పేర్కొన్నారు.

## నేడు నూరు శాతం పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి : ఎంపీడీవో మల్లేశ్వరి



పెదకూరపాడు, మేజర్ న్యూస్ : నేడు జరగబోవు పెన్షన్ ల పంపిణీకి సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మండల అభివృద్ధి అధికారిని మల్లేశ్వరి తెలియజేశారు. మండలం నందు మొత్తం 7768 పెన్షన్లకు గాను మూడు కోట్ల 30 లక్షల 93500 రూపాయలు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి 122 మంది సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా 7మంది మండల స్థాయి అధికారులను పర్యవేక్షణ నిమిత్తం సూపర్వైజర్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. కావున ఉదయం 5 గంటల నుండి పెన్షన్ పంపిణీ చేయవలసిందిగా అధికారులకు సూచనలు జారీ చేయడమైనదని తెలిపారు.

# రక్షిత తాగునీరు ప్రజల హక్కు : ఎమ్మెల్యే అరవిందబాబు





పల్నాడు జిల్లా నేటిదినపత్రిక సూర్య బ్యూరో

అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందిస్తామన్న హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. రొంపిచర్ల మండలంలో వీరాటం, కొనకంచివారిపాలెంలో జల్ జీవన్ మిషన్ శంకుస్థాపన చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు తాగునీరు కూడా మగ్యమై పోయిందన్నారు. ప్రజలకు తాగునీరు కూడా సకాలంలో అందించలేకపోయిన జగన్ రెడ్డి చేతకానితనానికి సిగ్గుపడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అమలు చేస్తే..రాష్ట్రం వాటా ఇవ్వకుండా జగన్ రెడ్డి పథకాన్ని నీరుగార్చాడన్నారు. ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేసి,నిరందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, నల్లపాటి రాము,పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, మొండితోక రామారావు, ఇంజనీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## జల శక్తి అభియాన్‌పై అవగాహన ర్యాలీ




పెదకూరపాడు, మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన పెదకూరపాడు లో ఎంపీడీవో మల్లేశ్వరి ఆధ్వర్యంలో జల శక్తి అభియాన్ అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల సిబ్బంది మరియు స్కూలు విద్యార్థులతో కలిసి గ్రామ పురవీధులలో ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మల్లేశ్వరి మాట్లాడుతూ నీటిని వృధా చేయకూడదని నీటి వినియోగం, నీటిని ఆదా చేయడం, వర్షపు నీటిని ఒడిసి పట్టటం వంటి వాటిపై గ్రామస్తులకు అవగాహనను కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, క్షేత్ర సహాయకులు, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అభ్యుదయ కవి దాశరథి కృష్ణమాచార్యులు శత జయంతి వేడుకలు



చిలకలూరిపేట, మేజర్‌న్యూస్: నాదెండ్ల మండలం గణపవరంలోని ముండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా దాశరథి కవిత్వంలో సామాజికత, శాస్త్రీయ దృక్పథం అనే అంశం పై ప్రముఖ సాహితీవేత్త డా.పివి సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెన్నుపాటి చైతన్య, జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు డా.దార్ల బుజ్జిబాబు, తెలుగు అధ్యాపకురాలు సువార్త వాణి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## అటవీశాఖ అధికారులపై జరిగిన దాడిపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

పల్నాడు జిల్లాలో అటవీ శాఖ ఉద్యోగులపై దాడి ఘటనపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎంతటి వారినైనా సహించవద్దని పునరాగం రాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించినట్లు సమాచారం. పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడిన పవన్ కళ్యాణ్, వన్యప్రాణులను అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించవద్దన్నారు. అటవీ శాఖ ఉద్యోగులపై దాడి చేసినా కఠిన చర్యలు తప్పవన్న పవన్ కళ్యాణ్.

## విద్యార్థిలోకంలో స్ఫూర్తిని రగిలించి, చైతన్యాన్ని కలిగించిన ఏఐఎస్ఎఫ్



చిలకలూరిపేట, మేజర్ న్యూస్: భారత విద్యార్థిలోకం లో స్ఫూర్తిని రగిలించి, చైతన్యాన్ని కలిగించి సంఘటితరగా ముందుకు నడిపే చోదక శక్తి ఏఐఎస్ఎఫ్ పలువురు నాయకులు అని కొనియాడారు. ఏఐఎస్ఎఫ్ చిలకలూరిపేట నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చిలకలూరిపేట పట్టణంలోని పండరీపురం నందుగల భారతరత్న ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ పాఠశాల, శ్రీ చైతన్య జూనియర్ మహిళా కళాశాల క్యాంపస్ లలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై భవిష్యత్తు పోరాటాలకు అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ చిలకలూరిపేట నియోజకవర్గ కమిటీ కార్యదర్శి మేకపోతుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు మెగావత్ సాయి నాయక్, నాయకులు కొత్తపట్నం పాతపట్నం గోపి, అన్నం శ్రీనివాస్, తెల్లబాటి సాహిత్, గుడిపల్లి జగదీష్, ఏఐఎస్ఎఫ్ ఇంచార్జ్ బొంతా భగత్ సింగ్ తదితరులున్నారు.

## గర్భిణి స్త్రీమరియు తల్లి-బిడ్డలకు పౌష్టిక ఆహార పంపిణీ



చిలకలూరిపేట,మేజర్ న్యూస్ : చిలకలూరిపేట 100 పడకల ప్రభుత్వాసుపత్రిలో"రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం "ఆధ్వర్యములో రాగిపిండి ,సగ్గుబియ్యం ,బెల్లం ,బత్తాయి ,దానిమ్మ పండ్లు మరియు రొట్టెలు పంచుట జరిగినది .ఈ కార్యక్రమములో రోటరీ ప్రెసిడెంట్ :వారణాశి శరత్ కుమార్ శాస్త్రి ,సెక్రటరీ బీకొల్లావెంకట సుబ్బారావు ,ట్రెజరర్:జంపని శ్రీనివాసరావు ,రోటరీ సభ్యులు కొల్లాసింగారావు ,పోలిశెట్టి రాఘవయ్య ,దడబడపుల్లయ్య ,అలా దాసునాయన ,పూసల మణి ప్రసాద్,చెంచు పున్నయ్య ,జంగా అభిరామ్ ,తులసి వసంతరావు ,అలంగార్ మోహన్ ,కెఎస్ఆర్ రాజు ,డాక్టర్ భవాని హాస్పిటల్ సూపరిండెంట్ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు

## రోజుకో మలుపు తిరుగుతున్న హత్య కేసు

వినుకొండ, మేజర్ న్యూస్ : పట్టణంలో తొలి ఏకాదశి రోజు జరిగిన హత్య కేసుకి సంబంధించి మరో ముగ్గురు ముద్దాయిలను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్ కి పంపినట్లు సిఐ సాంబశివరావు తెలిపారు. ముద్దమూరు బస్టాండ్ వద్ద తొలి ఏకాదశి రోజు రాత్రి 8 గంటలకు హత్య షేక్ రషీద్ తన పాత మిత్రుడు జిలాని చేతిలో హత్యగావించబడ్డాడన్నారు. ఈ కేసుకు సంభందించి ఇప్పటికే ప్రధమ ముద్దాయి అయిన షేక్ జిలానీ తో కలిపి ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్ కి పంపడం జరిగినదని తెలియజేసారు. అదేవిదంగా ఈ కేసు నందలి మిగిలిన మరో ముగ్గురు ముద్దాయిలను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్ కి పంపుతున్నట్లు ఆయన ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు. బుధవారం అరెస్ట్ అయిన వారిలో పట్టణంలోని సంజీవ్ గాంధీ నగర్ కు చెందిన పఠాన్ సైదా,(తండ్రి మస్తాన్ వలి)ఒకరుకాగా,పట్టణంలోని ఓబయ్య కాలనీకి చెందిన బొట్ల పాలెం సుభాని (తండ్రి బాజీ)అని,అలాగే పట్టణంలోని సంజీవ్ గాంధీ నగర్ కు చెందిన దారా ప్రవీణ్ (తండ్రి నరసింహారావు)లుగా పోలీసులు తెలియజేశారు. ఈ ముగ్గురిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కి పంపడం జరిగిందని సీఐ తెలియజేశారు.

## ఉపాధ్యాయుడు వితరణ.



**దుగ్గిరాల, మేజర్ న్యూస్:** దుగ్గిరాల బాలికోన్నత పాఠశాల లో సైన్స్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న తాడిబోయిన శ్రీనివాస చక్రవర్తి పుట్టినరోజు పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు వైట్ లాంగ్ నోట్ బుక్ మరియు పెన్నులను. బుధవారం బహుకరించారు. పుట్టిన గడ్డను పాఠశాలలో పనిచేస్తున్న పాఠశాల విద్యార్థులను పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించాలని తపనతో పాఠశాలలో. సైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న శ్రీనివాస చక్రవర్తి తన పుట్టినరోజును పురస్కరించుకుని పాఠశాలలోని విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులందరికీ సుమారు 21,000 రూపాయల మేరకు వైట్ లాంగ్ నోట్ బుక్స్ మరియు పెన్నులను బహుకరించారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల.0 దరూ దుగ్గిరాల బాలికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకుని తమ శక్తి మేర, తమ పాఠశాలను తమ పాఠశాల విద్యార్థులను అభివృద్ధి పథంలో నడిపిస్తే ప్రభుత్వం అందించే సహాయం కోసం ఎదురు చూడవలసిన ఆవశ్యకత ఉండదనే భావన ను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా శ్రీనివాస్ చక్రవర్తి పని చేసే పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయులు తమ పుట్టినరోజును పురస్కరించుకుని పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమనిపిస్తుంది.

## నిత్యవసర వస్తువుల ధరలు మరోసారి తగ్గింపు



**తెనాలి మేజర్ న్యూస్:** పౌర సరఫరాల శాఖ నెలరో జుల కిందటి నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించగా తాజాగా మరోసారి నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించింది. ఇప్పటికే ధరలను రెండుసార్లు తగ్గించగా, బియ్యం, కందిపప్పు, స్టీమ్ రైస్‌ల యొక్క ధరలను మరోసారి తగ్గిస్తామని పౌరసరఫరాలు వినియోగ దారుల వ్యవహారాలు శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ మార్కెట్లో బియ్యం ధర 48 రూపాయల నుండి 47 రూపాయలకి, కందిపప్పు ధర 160 రూపాయల నుండి 150 రూపాయలకి, స్టీమ్డ్ రైస్ 49 రూపాయల నుండి 45 రూపాయలకి తగ్గించటం జరిగిందని, ఈ తగ్గించిన ధరలతో, రైతుబజార్లలో, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నామన్నారు.

## నిరులాలో బీటెక్ తరగతుల ప్రారంభం




**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** గుంటూరు శివారు పలకలూరు రోడ్ లోని, విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సర తరగతులు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక తెలిపారు. కుమారి యశస్వి శుభగాత్రి స్వాగత నృత్యం, దీప ప్రజ్వలన తో మొదలైన ఈ కార్యక్రమంలో ముందుగా విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షులు డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ.. విజ్ఞాన్ నిరుల బాలికలను శక్తివంతమైన, మేధోవంతులైన యువ ఇంజనీర్లుగా తీర్చి దిద్దుతూ, వారి శారీరక, మానసిక వికాసానికి అనువైన వాతావరణం లో నిర్వహించబడుతున్నదని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పి. రాధిక మాట్లాడుతూ తమ కళాశాల యాజమాన్యం మరియు అధ్యాపక సిబ్బంది విద్యార్థినులను కన్న బిడ్డల వలె భావిస్తూ, వారి బంగారు భవిష్యత్తు కు మార్గం సుగమం చేస్తున్నదని అన్నారు. అనంతరం వివిధ విభాగాధిపతులు తమ విభాగపు విశిష్టత ను వివరించారు. ఈ విద్యా సంవత్సరం లో నిరులలో తాము చేరటం తమకు తమ తల్లి తండ్రులకు ఎంతో ఆనందం గా వున్నదని నూతన విద్యార్థినిలు తెలిపారు.

## కళ్ళంలో "అమ్మ పేరుతో ఒక మొక్క"




**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** గుంటూరు రూరల్ చౌడవరంలోని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవ పథకం (ఎన్.ఎస్.ఎస్) ఆధ్వర్యములో కళాశాలలో ఘనముగా "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమాన్ని నిర్వహించినారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమాశంకరరెడ్డి మాట్లాడుతూ చెట్లు మనకు స్వచ్ఛమైన గాలి, నీరు మరియు ఆహారాన్ని అందిస్తాయి. నువ్వు చెట్టుని కాపాడితే ఆ చెట్టు నిన్ను కాపాడుతుంది అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి ఎస్ బి రెడ్డి మాట్లాడుతూ.. తల్లి పేరు మీద ఒక్క చెట్టు నాటాలని కళాశాల విద్యార్థిని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమములో భాగముగా సుమారు 100 మొక్కలను కళాశాల ఆవరణములో నాటి మొక్కల పెంపకం గురించి ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల సివిల్ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ ఎం. సతీష్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ ఫి పున్నారెడ్డి, మరియు ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ అసోసియేట్ ప్రొఫెసర్ దోరశిల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సజావుగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



**తెనాలి టౌన్ న్యూస్:** పురపాలక సంఘ సభ్యుల సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలు నందు జరిగింది. మొత్తం 37 అంశాలపై సభ జరగగా 19వ అంశముగా పేర్కొన్న 2వ వార్డ్ కౌన్సిలర్ అన్నావద్దని పద్మజ ఫిబ్రవరి నెల నుండి సాధారణ సమావేశాలకు హాజరుకానందున, సభ్యత్వం కోల్పోయే విషయాన్ని వచ్చే సమావేశాలకు వాయిదా వేయడం జరిగిందని చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక తెలిపారు. ఎక్కువమంది అధికార ప్రతిపక్ష సభ్యులు నేటి సరఫరా కులాయి కనెక్షన్లు పట్టణంలో ఎన్ని ఇచ్చారు వాటి యొక్క నీటి పనులు ఒక్కొక్క వార్డులు ఒక్కొక్క రకంగా ఎందుకు వసూలు చేస్తున్నారు ఒక్కొక్క చోట 6000 నుండి 9000 రూపాయల వరకు ఎ రకంగా వసూలు చేస్తున్నార ,అని ప్రశ్నించారు. దీనికి మునిసిపల్ కమిషనర్ బి శేషన్న స్పందిస్తూ వచ్చే సమావేశాలు నాటికి పూర్తి వివరాలతో సభ ముందు ఉంటామని అధికారులు ఎవరైనా సరే మున్సిపల్ చట్టం ప్రకారం ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. 11వ వార్డు కౌన్సిలర్ కటారి విజయలక్ష్మి తన వార్డులో గురవయ్య కాలనీ నుండి పూలే కాలనీకి వెళ్లే దారికి ఇరువైపులా చెత్త వేస్తున్నారు ,అని పూలే కాలనీవాసులు ఈ చెత్త చెదారం వల్ల పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు.

## డాక్టర్ బాల బ్రహ్మాచారి కి ఉత్తమ జాతీయ విశిష్ట ఫిజియోథెరపి, ఆయుర్వేద వైద్య, సేవ రత్న మరియు నంది అవార్డు



**గుంటూరు, మేజర్ న్యూస్:** పద్మభూషణ్ గుఱ్ఱం జాషువా కళా పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ పురస్కార కార్యక్రమం లో భాగంగా తేనాలి ని కొత్తపేట యన్ జి ఓ కళ్యాణ మండపంలో జరిగిన జాతీయ పురస్కారాల వేడుకల కార్యక్రమంలో డాక్టర్ బాల బ్రహ్మాచారి ని జాతీయ విశిష్ట ఫీజియో థెరపీ ,ఆయుర్వేద వైద్య సేవా రత్న మరియు నంది అవార్డు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పద్మభూషణ్ గుఱ్ఱం జాషువా కళా పరిషత్ చైర్మన్ యోహాను మాట్లాడుతూ గత రెండు దశాబ్దాల నుంచి పేద ప్రజలకు ఉచితంగా ఆయుర్వేద వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ బాల బ్రహ్మాచారి సేవలు మరువలేనివి అన్నారు. ఈ సందర్భంగా దాదాపుగా తెలుగు రెండు రాష్ట్రాల్లో వచ్చిన కళాకారులను వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని గుర్తించి ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ అవార్డ్ ల సభ లో జిల్లా ప్రజా పరిషత్ ఛైర్పర్సన్ శ్రీమతి కె హెన్రీ క్రిస్టిన ,రత్నం డాక్టర్ రంగి చెట్టి రమేష్, డాక్టర్ సు బ్ర మన్య, డాక్టర్ మల్లేశ్వర రావు, డాక్టర్ హర గోపాల్ పలురువు పుర ప్రముఖులు లు పాల్గొన్నారు.

## ఆర్ వి ఆర్ అండ్ జె సి అధ్యాపకురాలు కు పీహెచ్ డి



**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న వసంతం ఝాన్సీ రాఘవ కోట పద్మినివల్లి కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. అధ్యాపక వృత్తిలో 13 సంవత్సరాలు అనుభవం గడించిన ఎస్.జె.ఆర్.కె.పద్మినివల్లి వి "యాన్ ఎఫీషియంట్ సెంటిమెంట్ బేస్డ్ ఎమోషన్ క్లాసిఫికేషన్ ఇన్ అన్ స్ట్రక్చర్డ్ టెక్స్ట్యువల్ డేటా యూజింగ్ హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ " అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించింది. ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ & హెచ్ ఓ డి, డా.ఎమ్.వి.పి.చంద్రశేఖరరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పి.హెచ్.డి., పొందారు. ఈ సందర్భంగా కళాశాలలో పి.హెచ్.డి కలిగిన స్టాఫ్ మొత్తము 144 మంది వున్నారని, పరిశోధనలను కళాశాల ప్రోత్సహిస్తుందని కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. ఎస్.జె.ఆర్.కె. పద్మినివల్లి వి, పి.హెచ్.డి., పొందిన సందర్భంగా కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్, అకడమిక్స్ అండ్ ఆర్& డి డా.కొమ్మినేని రవీంద్ర, డైరెక్టర్, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి.శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.ఎమ్.శ్రీలత అభినందించారు.

## డిఎస్పీ బదిలీ



**తెనాలి టౌన్ న్యూస్:** బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 96 మంది డిఎస్పీలను బదిలీ చేయడం జరిగింది. ఈ సాధారణ బదిలీల్లో భాగంగా కొందర డీఎస్పీ లకు స్థానభ్రంశం కలుగగా, మరికొందరిని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో రిపోర్ట్ చేయవలసిందిగా ఆదేశాలు వచ్చినవి. ఈ బదిలీల్లో భాగంగా తెనాలి పోలీస్ సబ్ డివిజన్ డి.ఎస్.పి అయిన ఎం.రమేష్ ను పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు బదిలీ చేయగా, నూతన డిఎస్పీగా బి.జనార్ధన్ రావు నియమితులయ్యారు.

